కథావేదిక

# కుచ్చుటోపీ

- పి.వి.శేషారత్నం

ఈరోజు నాకెంత సంతోషంగా వుందో చెప్పలేను.

నా సంతోషాన్ని వ్యక్తం చేయడానికి నాకున్న మార్గం నా ప్రియాతిప్రియమైన కుచ్చుటోపీ ఒక్కటే- ఊరొదిలిపోతూ- ఆ టోపీని మా రాజా ప్రెజెంట్ చేసాడు.

వాడూ నేనూ ఒక కంచంలో తిని ఒక మంచంలో పడుకోకపోయినా ఒక స్కూల్లోనే చదువుకున్నాం.

మా ఊళ్లో చిన్నప్పుడు కోతి కొమ్మచ్చి ఆటలో నేనోడిపోయినప్పుడూ- రాజుగారి తోటలో జామకాయలు కోసినపుడు తోటమాలి నన్ను పట్టుకోగానే వాడు పారిపోయినప్పుడూ వాడిని చితక్కొట్టాలనిపించేది.

కాని వాడికి నేనంటే ఎంత ప్రాణమో నాకూ వాడంటే అంతే. స్కూల్లో మార్కులు కూడ మా ఇద్దరికే- కాపీ కొట్టకపోయినా ఒకేలా వచ్చేవి- చివరికి డిగ్రీలో కూడ.

ఒక ఉద్యోగం దగ్గరే మా దారులు వేరయిపోయాయి.

వైకుంఠపాళీలో వాడు చకచకా నిచ్చెన లెక్కడానికి వాడికి పిల్లనిచ్చిన మామ తోడ్పడ్డాడు.

మేనరికం మూలానేమో పైసా కట్నం ఇవ్వకుండానే కాళ్లు శుభ్రంగా కడిగేసి కూతురిని అంటగట్టేసాడు నా మేనమామ. అలాగని మా సుందరి అంటే నాకయిష్టం ఏమీలేదుగాని ఎంతకీ నాకుద్యోగం రాకపోతోంటే అది దెప్పే దెప్పుళ్లు భరించలేకపోయేవాడిని.

చెంచాళ్లా ఇద్దరు పిల్లలు మా కుటుంబంలో చేరిపోయారు మూడేళ్లు తిరిగేసరికి.

అంతేగాని ఉద్యోగం మాత్రం నన్ను వరించలేదు.

ఏదో- తాతలనాటి పెంకుటిల్లుంది గనుక అద్దెబాధ లేదు. నాలుగు ప్రైయివేట్లు చెప్పుకుంటూ ఎలాగో బండి ఈడుస్తున్నాను మానాన్న పెన్షన్ డబ్బులు వేణ్ణీళ్లకు చన్నీళ్లవుతుంటే. ఉద్యోగం కోసం నే పట్టని కాళ్లు లేవు. నే తిరగని ఆఫీసు లేదు. నా ఫస్టుక్లాసులు, స్పోర్ట్స్ షీల్డులూ ఎందుకూ పనికిరాలేదు.

అనుభవం వుందేగాని ఉద్యోగం రాదు. ఉద్యోగం వస్తే తప్ప అనుభవం రాదు. 'పెళ్లయితేగాని పిచ్చికుదరదు పిచ్చికుదిరితేగాని పెళ్లవదు' అన్నట్టు. ఈ ప్రపంచంలో అన్నీ ఇంటర్ లింకులే. నాది చాదస్తం అంటాడు మా రాజా. అందుకు కారణం వుంది.

''ఉత్తర దక్షిణాలతో ఉద్యోగం రావాలిగాని నీ సెంటిమెంట్లూ మూఢనమ్మకాలతో కాదురా. నామాట విను- కార్పొరేషన్‌లో క్లర్కు పోస్టులున్నాయిట- దక్షిణగా ఓ పాతిక నీది కాదనుకుంటే ఆ ఉద్యోగం నీదవుతుంది. ఉత్తరం విషయం నేను చూసుకుంటా'' అన్నాడోసారి వాడు.

అనుకోడానికి నాకభ్యంతరం లేదుగాని పాతిక వేలంటే మాటలా? ఎక్కడ్నుంచి తేను? నాన్నగారసలే మేష్టరు గిరీ చేసారేమో మహా స్ట్రిక్టు.

''నీ కర్మ పరిపక్వమైనపుడే నీకుద్యోగం వస్తుంది'' అనేది ఆయన వాదన.

''ఆ ఏడుకొండలవాడి కరుణ వుండాలిరా'' అంటుంది అమ్మ.

సుందరి మాత్రం ''ఈ ముసలాళ్లకి జన్మలో బుద్ధి రాదు. మీరూ వాళ్ల దారిలో నడిస్తే ఎలా? ఈ ఇల్లు తాకట్టు పెట్టి కాస్త డబ్బు తీసుకురండి. నేనూ మానాన్న ప్రాణాలు తోడి కొంత తెస్తాను. ఉద్యోగం వస్తే అప్పు ఎంతలో తీర్చేస్తాం'' అంది.

సుందరి ధీమా సంగతెలా వున్నా ఇల్లు పేరెత్తడానికి నాకు గుండెలు చాలద్దూ. నెల గడిచాక మా రాజా వచ్చి నానా హంగామా చేసాడు.

''వాజెమ్మా నామాట విన్నావు కాదు.

బంగారం లాంటి పంట పండే సీటు అది. ఆ ఉద్యోగం కాస్త తెలివైనవాడు తన్నుకుపోయాడు. ఇదిగో ఈ కుచ్చుటోపీ తీసుకుని తగలడు. మొన్న కాశ్మీరు వెళ్లినపుడు నువ్వే గుర్తొస్తే కొన్నాను. ఒరే నాకు ట్రాన్స్‌ఫరయిపోయిందిరా. మళ్లీ తరచుగా నాకిటువైపు వచ్చేందుకు వీలుండదు. వెళ్లాక ఉత్తరం రాస్తా అడ్రసుతో. ఉత్తరాలు తగలేస్తూండు. ఒక్కసారి నా ఎదురుగా ఈ టోపీ పెట్టుకోరా. చిన్నప్పుడు ఈ టోపీ షోకు కోసమని ఎంజీఆర్, ఎన్టీఆర్ సినిమాలు తెగచూసి మురిసిపోయే వాళ్లం గుర్తుందిరా?''

రాజా ఆ తెల్లకుచ్చుటోపీ ఇచ్చాక మేం దాదాపు కలుసుకోనేలేదు. కాని నాకు ఆనందం కలిగినపుడు వాడితో పంచుకున్నట్టుగా అది పెట్టుకుని టిప్‌టాప్‌గా తయారయి అద్దంలో చూసుకుని మురిసిపోయేవాడిని మా సుందరి ఆటపట్టిస్తున్నా పట్టించుకోకుండా.

సంసార సాగరంలో ఈదలేక ఆపసోపాలు పడుతున్న నాకు కుచ్చుటోపీ పెట్టుకునే సందర్భాలు కరువైపోయాయి.

ఎదుగుతున్న పిల్లలతో పెరుగుతున్న అవసరాలు- రోగాలు- రొచ్చులూ-

నాన్నగారి విసుక్కోవడాలు-

పెళ్లాం సాధింపులూ-

చుట్టాల పక్కాల పరిహాసాలూ-

రోజులు గడిచిపోతున్నాయి-

కొట్లో పద్దులు రాస్తూ- ప్రయివేటు పాఠాలు చెప్పుకుంటూ నెట్టుకొస్తున్నాను. ఎలక్షన్లు వచ్చినప్పుడల్లా నాయకుల ఉపన్యాసాలు వింటూంటే వాళ్ల తలకాయలు పగలగొట్టాలనిపించేంత ఆవేశం-

ఒకడు- 'దేశంలో నిరుద్యోగం లేకుండా మా పార్టీ ఇన్ని పథకాలు పెట్టిందీ' అంటే మరోడు 'మా పార్టీ మరెన్నో పెట్టింది' అనే ఊక దంపుడు ఉపన్యాసాలకు మనసు మండిపోతున్నా చప్పట్లు కొట్టక తప్పేదికాదు. ఎందుకంటే లారీలో మమ్మల్ని మోసుకుపోయి చప్పట్లు కొట్టినందుకు కాస్తో కూస్తో ముట్టచెప్పేవాళ్లు పార్టీల వాళ్లు. చుట్టాల్లో ఎవరో నాన్నగారికి సలహా ఇచ్చారు. ''స్వయం ఉపాధి పథకాలు ఎన్నో ఉన్నాయిగా- ఏదో ఒకదానికి అప్లై చేస్తే లక్షో లక్షన్నరో వస్తుంది. ఉద్యోగం వయస్సు ఎలాగూ దాటిపోతోంది. ఇక గవర్నమెంటు ఉద్యోగం గగనమే'' అంటూ-

ఆ ముచ్చటా అయింది-

దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వలేదన్నట్టు-

పరిశ్రమల కేంద్రం వాళ్లు సెలక్టు చేసినా బ్యాంకు లోన్ల కోసం తిరిగి తిరిగీ నావీ నాన్నగారివీ కూడ చెప్పుల జతలరిగిపోయాయి. ఆచా వాచా తేలిందేమిటంటే నాన్నగారి మాటల్లో- 'కర్మ పరిపక్వం కాలేదు'-

అమ్మ మాటల్లో-

'ప్రాప్తం లేదు- కలసి రాలేదు'-

సుందరి ఏం మాట్లాడలేదు ఎందుకనో- కాని అంత కుమించి ఆవిడగారి పెదవి విరుపులో 'నువ్వే వాజెమ్మవి' అనే గూడార్థం-

ఆటుపోటు మీదున్న సముద్రంలో జలచరంలా వుంది నా స్థితి-

సరిగ్గా అలాంటపుడు నా ఇంటికొచ్చి అదృష్టదేవత తలుపు తట్టినట్టు-

శ్రీహరి సాక్షాత్తూ శ్రీమహావిష్ణువులాగే అనిపించాడు-

అతని పుణ్యమే చాలారోజుల తర్వాత నేనీరోజు కుచ్చుటోపీ పెట్టుకుని పొంగిపొరలుతున్న ఆనందంతో కేవలం అద్దం ముందు కాకుండా బొంబాయిలో పట్టపగలు నడిబజార్లో హాయిగా తలెత్తుకుని తిరగడం-

శ్రీహరి మావూరి కొచ్చి ఏడాదయింది- వాళ్ల పెదనాన్న గల్ఫ్‌లో వుండి బాగా సంపాదించాడు- మంచి గోల్డు రిస్టువాచ్‌లూ, బంగారు గొలుసులూ, జేబుకి బంగారు గుండీలు పెట్టుకుని తిరుగుతుండేవాడు-

ఉద్యోగం లేనివాళ్లమంతా పార్కులో కూర్చుని పిచ్చాపాటీ, కష్టసుఖాలూ వెళ్లబోసుకుంటూంటే పలకరించాడోసారి.

అప్పట్నుంచీ మాలో ఒకడైపోయాడు- అతనికి ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం లేదు- తల్లీదండ్రీ, చెల్లెళ్లిద్దరూ- అంతా మంచి బట్టలు నగలు వేసుకునేవారు- ఆ నగలు బట్టలు చూసి నా మనసు కలుక్కుమనేది.

నేనూ ఏ గల్ఫ్‌కో పోయి వుంటే మా సుందరీ నా

పిల్లలూ ఇలాగే వుండేవారు కదా అని-

శ్రీహరి సలహాలెంతో బాగుండేవి- అవి పాటించడం వల్ల మాలో ఒకడికి ఉద్యోగం వచ్చింది కూడ-

అతడేం చదువుకున్నాడో చెప్పలేదుగాని చాల తెలివైన వాడని మాత్రం మాకర్థమయింది. ఇంటర్వ్యూలు ఎలా ఫేస్ చెయ్యాలో ఇతరులను ఎలా ఇంప్రెస్ చెయ్యాలో ఎంతో బాగా చెప్పేవాడు.

ఈ శ్రీహరే రెండేళ్ల ముందు పరిచయమయివుంటే నా జీవితమే మారిపోయి వుండేది. నేనూ ఇతని గైడెన్స్‌తో ఏదో ఉద్యోగంలో సెటిలయిపోయేవాడిని.

శ్రీహరి పట్ల మా నిరుద్యోగులందరికీ ఓ ఆరాధన కూడ ఏర్పడింది. కారణం-

అతనూ పదీ పరకా మా కోసం ఖర్చుపెట్టడం- హోటల్ పేరు చెబితే భయపడే మమ్మల్ని మంచి హోటల్‌కి తీసుకెళ్లి స్వప్నంలో విహరింపజేయడం జరిగేది.

మొహమాటంతో ఎప్పుడైనా మేమెవరైనా డబ్బులు తియ్యబోతే కసురుకునేవాడు.

''ఉంచండి మాస్టారూ- నాకింకా పిల్లాపాపా లేరుగా- ఫ్రీబర్డ్‌ని- మీకేవో ఖర్చులుంటాయి.''

ఓరోజు శ్రీహరి చాల దిగులుగా కనిపించాడు.

మా అందరి గుండె కలుక్కుమంది.

''మాస్టారూ మా పెదనాన్న ఉత్తరం రాసాడు. నేనూ అక్కడికి రావాలిట. ఆయనకి పిల్లల్లేరులెండి. ఆయన ఓ పెద్ద శానిటోరియం కట్టిస్తున్నాట్ట.''

చంద్రం అన్నాడు-

''అదే నేనయితే ఎగిరి గంతేసేవాడిని. గల్ఫ్‌లో బోలెడు సంపాదించుకోవచ్చు.''

''ఆమాట నిజమే. నెలకి ముప్ఫయివేలు వస్తాయి ఆ వర్కు సూపర్‌వైజు చేస్తే. కాని మన భాష కాదు. మన మనుషులు కాదు. మన ఆచారాలు కాదు.''

''అయితేనేంటి గురూ. ముప్ఫయివేలంటే మాటలా? ఎంతైనా అదృష్టవంతుడివి'' నీలకంఠం అన్నాడు.

''మీ అందరినీ వదిలి వెళ్లాలంటే ఎంత బాధ'' కళ్ల నీళ్లు చిప్పిల్లాయి శ్రీహరికి.

నాకు మా రాజా గుర్తొచ్చాడు- వాడూ ఇంతే-

''అయితే మమ్మల్ని తీసుకుపో''-

నోరు జారింది వైకుంఠరావుకి-

''సారీ శ్రీహరీ'' మళ్లీ వెంటనే అతనే అన్నాడు అదెంత అసాధ్యమో తెలిసి.

నిజమే గల్ఫ్ వెళ్లాలంటే ఆషామాషీ కాదు. ముందు అక్కడ పని దొరకాలి. పాస్‌పోర్ట్- వీసా- అబ్బో చాల తతంగం- వెళ్లడానికి డబ్బూ దస్కం-

కానీ వైకుంఠం మాటలు అందరినీ ఆలోచనలో పడేసాయి- శ్రీహరి కాసేపు గంభీరంగా వుండిపోయాడు.

''నేను మా పెదనాన్ననే విషయం కనుక్కుంటాను. రాత్రికి ఫోన్ చేద్దాం.''

ఇంక ఎవరూ ఒక్కక్షణం కూడ శ్రీహరిని వదల్లేదు- వదిల్తే తప్పిపోతాడేమోనని తల్లి కొంగు పట్టుకుని తిరిగే పాపల్లా-

రాత్రి పదకొండు ఎప్పుడవుతుందా అని అందరికీ ఆత్రం-



శ్రీహరి వాళ్ల పెదనాన్నతో మాట్లాడి నిరాశగా మొహం పెట్టాడు-

అందరికీ ఆదుర్దా-

''ఏంటి శ్రీహరీ- ఏమన్నారాయన?''

''శానిటోరియం కట్టేందుకు మనుషులు వందల సంఖ్యలో అవసరమేనట. కాని జీతం నెలకి పన్నెండు పదిహేను వేలకి మించదు. పైగా పాస్‌పోర్టు వీసాలకి ఒక్కొక్కరికి పాతిక ముప్పైవేలదాకా అవుతుంది. ఆలస్యం కూడ అవొచ్చు అన్నారు పెదనాన్న. కనీసం వందమందినైనా పోగేయగలిగితే నాకూ కమిషన్ వస్తుందిట.''

పాతిక వేలనగానే అందరి గుండెలూ జారిపోయాయి. ఒకవైపు ఆశ- ఎలాగైనా వెళ్లగలిగితే ఓ ఏడాదిలో రెండు లక్షల దాకా సంపాదించుకోవచ్చు- అదృష్టం బావుంటే అక్కడే మరేదైనా పని దొరుకుతుంది ఈ ఏడాది గడిచేలోగా-

వారం రోజులపాటు శ్రీహరి కనిపించలేదు- మద్రాసు వెళ్లాడు వీసా కోసం-

ఆ వారం రోజులూ ఎవరికీ నిద్ర లేదు-

శ్రీహరి రాగానే అంతా చుట్టుముట్టారు-

అతనికి వీసా రావడానికి మూడునెలలు పడుతుందిట-

శ్రీహరి మరో మూడునెలలు మాతో వుంటాడని మా

## నీళ్లలో పిల్లలు!

పర్వతాకారంలో వుండే హిపోపోటమస్‌కు పుట్టే పిల్లలన్నీ నీళ్ల అడుగున పుడతాయి. అందుకనే అవి పెరిగి పెద్దవి అయిన తర్వాత కూడా ఎక్కువ సమయాన్ని నీళ్లలోనే గడుపుతాయి!

## సారా ఉత్సవం!

పశ్చిమ జర్మనీలో ఆమధ్య ద్రాక్షసారాయి ఉత్సవం జరిగింది! రెండున్నర మైళ్ల పొడవుగల ఓ బ్రహ్మాండమైన బల్లమీద 15వేలమంది జనం కూర్చుని ద్రాక్షసారాయి తాగారు! వారిముందున్న బల్లలమీద రెండు టన్నుల వేపుడు మాంసం, మూడుటన్నుల బంగాళా దుంపల సలాడ్, 150 కేజీల మస్టర్డ్ వుంచబడ్డాయి. సారాయి ప్రియులంతా కలశాలెత్తి మదిరను తనివితీరా గ్రోలారు!


## హృదయ్‌కుంజ్

గుజరాత్‌లోని అహమ్మదాబాద్‌లోగల సబర్మతీ ఆశ్రమంలో 'హృదయ్‌కుంజ్' 1917వ సంవత్సరం జూన్ నెలనుంచీ మహాత్మాగాంధీ, కస్తూరి బాల నివాసం అయింది!

## కుక్కలు

డెన్‌మార్క్‌లో ఉత్తరాలు ఇచ్చే అమ్మాయిలకీ, అబ్బాయిలకీ కుక్కలవల్ల పెద్ద బెడదొచ్చి పడింది. ముఖ్యంగా అమ్మాయిలను శునకాలు వెనుకబడి తరుముతున్నాయి. 77 శాతం ఇటువంటి కేసులే. ఉత్తరాలు ఇచ్చే పురుషులు బలంగా ఉంటారు కనుక కుక్కలు వాళ్ల జోలికి పోవడం లేదనీ, బలహీనులైన అమ్మాయిల వెంట అవి పడుతున్నాయనీ అధికారులు సెలవిచ్చారు.

- కొడిమెల




అందరికీ ఆనందంగా వున్నా పచ్చి వెలక్కాయలా గొంతులోనే కొట్టుకుంటున్న మా అందరి ఆశ!

వైకుంఠం, శర్మ ఏం అవస్థలు పడ్డారోగాని పాతికేసి వేలు తెచ్చి శ్రీహరి చేతిలో పోసారు.

''నీవే శరణు''

శ్రీహరి అంగీకరించలేదు-

''నాకెందుకు గురూ''

''మరి వీసా...''

''అవి మీరే వెళ్లి తెచ్చుకోండి''

''మేమా? మాకేం తెలుసు''

''భలేవాళ్లే నాకు మాత్రం ఏం తెలుసు- అంకుల్ మద్రాసులో వున్నారు కనుక అంతా ఆయనే చూసుకున్నాడు''

వాళ్లింక అతన్ని వదల్లేదు-

శ్రీహరి గల్ఫ్ ప్రయాణం సంగతి ఊరంతా పాకిపోయింది.

మా సుందరికెలా తెలిసిందో నన్ను రాత్రీ పగలూ నిద్ర పోనీయడం లేదు-

''మీరు ఊ అనండి- ముసలాళ్లిద్దర్ని నేనొప్పిస్తాను''

నేనేం మాట్లాడలేదు ఎందుకంటే ఈమధ్యలో మరో దుమారం లేచింది-

పేపర్లో గల్ఫ్‌లో ఉద్యోగాల పేరిట జరుగుతున్న మోసాలు చదివిన పెద్దవాళ్ల సలహాతో శర్మ, ఆనంద్ శ్రీహరి దగ్గర నోరు జారారు-

అతనికెంత కోపం వచ్చిందంటే-

ఆ సాయంత్రమే ఎలా తెచ్చాడో ఏభైవేలు తెచ్చి ఆ ఇద్దరి మొహాన గిరాటేసాడు-

''ఈరోజుతో మన స్నేహం చెల్లు- నేనేమైనా మీ అందర్ని నాతో రమ్మన్నానా నాకు వీసాల కోసం డబ్బులిమ్మన్నానా? ఇదిగో మీ ఇద్దరి వీసా కాగితాలు- స్నేహితులు కదా దేశంగాని దేశంలో ఒకరికొకరం తోడుంటామని మీ అందరి పనీ మా అమ్మానాన్న వద్దంటున్నా వినకుండా నెత్తినేసుకుంటే ఇదన్నమాట నాకు దక్కిన మాట- తీసుకెళ్లండి మీ డబ్బు- మళ్లీ నాతో మాట్లాడ్డానికి ప్రయత్నించొద్దు''

నిజానికి ఆనంద్ శర్మ బయటపడ్డారుగాని చాలమందికే ఆ సందేహం వచ్చింది. కాని శ్రీహరి కోపం, నిజాయితీ చూసి ఎవరూ నోరు మెదపలేకపోయారు-

శర్మ, ఆనంద్‌ల వీసాలు ముక్కలు ముక్కలయి వాళ్లని వెక్కిరిస్తున్నాయి-

వాళ్ల మొహంలో కత్తి వాటుకి నెత్తురు చుక్క లేదు-

మిగిలిన వాళ్ళు మాత్రం నిబ్బరంగా ఊపిరి పీల్చుకున్నారు- తాము బయటపడి శ్రీహరి దృష్టిలో చెడ్డ వాళ్లం కానందుకు-

శర్మ ఆనంద్ తరపున వకాల్తా తీసుకుని మా మిత్రబృందం ఎంత చెప్పినా శ్రీహరి వినలేదు. అతని ముఖం అవమానభారంతో కందగడ్డలా అయింది.

''ఇది మా అమ్మానాన్నల ఎదుట జరిగితే ఎలాంటి పరిణామం ఎదుర్కోవలసి వుండేదో నేనూహించలేకపోతున్నాను. స్నేహం అనే ముసుగులో వీళ్లని ఎవరో తప్పుకుండా నిజంగానే కాటేస్తారు చూడు'' అక్కసుగా అన్నాడు.

''పోనీ శ్రీహరీ! వాళ్ల తరపున నేను క్షమాపణ కోరుతున్నాను''

నా విషయంలో మా సుందరి చాల ఆర్భాటమే చేసి అనుకున్నది సాధించింది-

అమ్మానాన్నలకి ఏం మంత్రం వేసిందో వాళ్లు ముభావంగా పద్దెనిమిది వేలు నా చేతిలో పెట్టారు.

నాకెందుకో హృదయం బరువెక్కిపోయింది.

ఆ ఇల్లు మా తాతల నాటి ఆస్తి-

రేపు నేను అప్పు తీర్చలేకపోతే ఇల్లు పోతే- మా అమ్మానాన్నలే కాదు పితృదేవతలు కూడ నన్ను క్షమించరు-

''మీ ఆవిడ ఎంతెంత మాటలన్నదోరా- నువ్వు బాగుపడితే మాకంతకన్నా ఏం కావాలి? కాని దేశంగాని దేశం పోయేబదులు ఉన్న ఊరు కన్నతల్లిని నమ్ముకుంటే బాగుంటుందేమో అన్నారు మీ నాన్న'' అంది అమ్మ కళ్లనీళ్లు పెట్టుకుంటూ-

కాని సుందరి తపన కూడ తీసేయతగ్గది కాదు-

పాపం పెళ్లికి వాళ్ల నాన్న చేయించిన గొలుసూ ఉంగరం అమ్మేసి మిగిలిన డబ్బు సర్దింది-

'సర్వమంగళ తన మంగళ సూత్రము మదినెంత నమ్మినదో' -చిన్నప్పుడు తెలుగు మేస్టారి పద్యం గుర్తొచ్చింది.

దాదాపు పాతికమంది వరకూ శ్రీహరితో బయలుదేరాం- అందులో ఆనంద్, శర్మ లేనందున అందరికీ మనసులో ఎంతో బాధగా వుంది- ఇక వాళ్లెంత బాధపడుతున్నారో మరి-

'మమ్మల్ని మర్చిపోకండేం- అంతా మా దురదృష్టం- అంతే' అవే వాళ్ల ఆఖరి మాటలు-

ఊరు దాటేదాకా అందరికీ మనసులో వున్న దిగులూ గుబులూ రైలెక్కగానే ఎగిరిపోయాయి-

మా సుందరి సంబరం ముఖం నన్ను చాలాదూరం వెంటాడింది. చుట్టుపక్కల ఇక రేపట్నుంచీ ఎన్ని గొప్పలు చెప్పుందో నడ్డిమీద చేతులు పెట్టుకుని తిప్పుకుంటూ-

బొంబాయిలో మూడురోజులు ఆగిపోవలసి వచ్చినా ఎవ్వరం బాధపడలేదు-

ఊరు వదిలి ఎప్పుడూ రాలేదేమో- అదీగాక జన్మభూమిని వదిలి ఎన్నాళ్లుండవలసి వస్తుందోనని- తనివితీరా నా దేశాన్ని దేశంలోని రకరకాల మనుషులను బొంబాయిలో కరువుతీరా చూసుకున్నాను-

''ఏం గురూ ఆ కుచ్చుటోపీ వదలవా?'' శ్రీహరి పరిహాసమాడాడు-

''ఇది నీలాంటి ఫ్రెండ్ ఇచ్చిందే శ్రీహరీ. ఇది పెట్టుకునే సందర్భం ఇన్నాళ్లూ రాలేదు. ఇప్పటికి దొరికింది నీ పుణ్యమా అని''

ఆ కుచ్చుటోపీని బీరువాలోని బట్టల మధ్యలోంచి తీసి దులిపి నా సూట్‌కేసులో పెట్టుకుంటూంటే సుందరి ఎంతందంగా నవ్విందో గుర్తొచ్చి మనసారా నవ్వుకున్నాను-

''ఏంటా నవ్వు?''

''మా సుందరి గుర్తొచ్చింది''

''అప్పుడే పోనీ ప్లేన్ ఎక్కేందుకు ఇంకా ఆరుగంటల టైముందిగా ఫోన్ చెయ్యి ఓసారి- మీ పక్కింటివాళ్లు పిలుస్తార్లే. వాళ్ల దృష్టిలో నువ్విప్పుడు కోటీశ్వరుడివిగా''

''అమ్మో పగలు చేస్తే బోల్డంత అయిపోదూ''

''బీద అరుపులు అరుస్తావే నాగూ- పోనీ నేనిస్తాగా''

''ఇంకా నీకెంత ఋణపడిపోమంటావు- ఈ మూడు రోజులూ లాడ్జింగ్ బోర్డింగ్, తిండీ అన్నిఖర్చులూ నువ్వే భరిస్తున్నావు. నీ ఇంటిలో కుక్కలా పుట్టాల్సి వస్తుందేమో చివరికి''

''ఎంతమాట- స్నేహం అంటే అదేనా? పోనీ కుచ్చు టోపీలా పుడుదువుగానిలే'' శ్రీహరి జోక్‌కి అంతా హాయిగా నవ్వేసారు.

అయినా నేను సుందరితో మాట్లాడలేదు ఫోనులో- ఎందుకంటే మళ్లీ నా మనసు ఇంటిమీదకి పిల్లల మీదకి పోతే నేను ప్లేన్ ఎక్కలేను- నా వీక్‌నెస్ అది.

''నీ ఇష్టం'' అనేసాడు శ్రీహరి.

''ఒక్కసారి బీచ్‌కి పోయి తనివితీరా మన జనాన్ని చూసొస్తాను'' అన్నాన్నేను.

''మళ్లీ నువ్వు తప్పిపోతే...'' శ్రీహరి మాటలకి అడ్డొచ్చాను.

''మూడురోజులుగా ఊరంతా తిప్పుతున్నావు. ఆమాత్రం ఈ హోటల్ పట్టుకోగలను లేవోయ్. నోట్లో నాలుకుంది నాకు.''

''నేనూ నీతో తిరిగొస్తాను గురూ'' మరో నలుగురు నాతో బయలుదేరారు- అందరికీ దేశం వదిలి వెళ్తున్నందుకు గుబులుగానే వుంది. రూంలో వుంటే అది మరింత ఎక్కువగా వుంటోంది.

''ఇదిగో మళ్లీ మిమ్మల్ని నేను వెతుక్కోలేను- సాయంత్రం ఐదింటికల్లా వేన్ బయలుదేరుతుంది. ఆరింటికి మనం ఎయిర్‌పోర్ట్‌లో వుండాలి. అక్కడ సెక్యూరిటీ తతంగం అదీ పెద్ద తలనొప్పి. ప్లేన్ రాత్రి ఎనిమిది గంటలకయినా మనం చాలాముందే వెళ్లి వెయిట్ చేయాలి.''

ఈ మాటలు శ్రీహరి పదిరోజులుగా చెప్తున్నవే-

బొంబాయి బీచ్ చూస్తుంటే భారత దేశమంతా అక్కడే వున్నట్టుంది. ఎన్నిరకాల మనుషులు, రంగులు, డ్రెస్సులు- పెద్దలు, పిల్లలు, రెస్టారెంట్స్‌లో కిటకిటలాడిపోతోంది. నాలాంటి టోపీవాలాలెందరో-

కళ్లకి గాగుల్స్ కూడ-

దొంగలెవరో దొరలెవరో పెద్దమనుషులెవరో తెలీడం లేదు. తిరిగి మేం హోటల్‌కెళ్లేసరికి రూంలు ఖాళీ- మా గుండె గుభేలుమంది- అక్కడికీ వైకుంఠం గోలెడుతూనే వున్నాడు. ''టైమయిపోతోంది గురూ'' అని- ఐదున్నర! నిజంగానే టైమయిపోయింది-

రిసెప్షన్‌లో అడిగితే అంతా ఎయిర్‌పోర్ట్‌కి వెళ్లిపోయారని చెప్పారు- మా ఆలస్యానికి మమ్మల్ని మేమే తిట్టుకుంటూ పరిగెత్తాం. కాని హోటల్‌వాళ్లు మమ్మల్ని కదలనీయకపోయేసరికి అవాక్కయ్యాం-

''బిల్ మీరు పే చేస్తారని చెప్పారు''

''బిల్లేమిటి? శ్రీహరి కట్టేసాడుగా''

''ఆయనెవరు- మీ పేరు నాగేశ్వర్రావు కదా మీ పేరుతోనే రూంలన్నీ బుక్ అయ్యాయి''

''ఎక్కడో ఏదో పొరబాటు జరిగింది. మేం ఎయిర్‌పోర్ట్‌కి వెళ్లి మా ఫ్రెండ్స్‌ని కలుసుకోవాలి. శ్రీహరి అక్కడే వుంటాడు.''

అసలే వచ్చీరాని హిందీ- దానికితోడు కంగారు-

అసలు మాదే తప్పు- ప్రయాణం పెట్టుకుని అంతా ఒకచోట వుండక- ఇలా పోవడమేమిటి- ఈ గోలేమిటి? అక్కడకీ శ్రీహరి అనే అన్నాడు- ఎక్కడకీ వెళ్లొద్దని-

కాని అది సామాన్యమైన గోలకాదని ఆ రాత్రే మాకు తెలిసిపోయింది. మా గోడు పట్టించుకునే వాళ్లెవరు-

కంగారుగా శ్రీహరి కోసం ఎదురుచూసి చూసీ ఎయిర్‌పోర్ట్‌కి మాకంటే ముందు వెళ్లి వెదికిన మిగిలిన మా బృందం ఘొల్లుమంది.

గల్ఫ్‌లో భారతీయ కరెన్సీ చెల్లదని పొద్దుటే- మా అందరి జేబుల్లో చిల్లరతోసహా ఊడ్చేసాడు శ్రీహరి- కట్టుగుడ్డలతో బొంబాయిలో భోరుమంటున్న మామీద ఒక ఆంధ్ర అధికారి సానుభూతి చూపించి పోలీసు రిపోర్టు ఇప్పించాడు- మా అందరిలో ఎక్కడో ఆశ మిణుకు మిణుకు మంటూనే వుంది.

శ్రీహరి ఏ ఏక్సిడెంటులోనన్నా చిక్కుకున్నాడా? అపాయంలో ఇరుక్కున్నాడా? రెండ్రోజులు ముష్టిబ్రతుకయిపోయింది. బొంబాయి నుంచి జేబులో పైసాలేకుండా అక్కడి ఆంధ్ర సంఘం దయాధర్మంతో తిరుగు రైలెక్కిన అందరి మనసులో ఒకటే ఆవేదన-

ఒకవేళ శ్రీహరి తిరిగి వచ్చి వెతుక్కుంటాడేమో! మమ్మల్నందరినీ తిడతాడేమో! ఇంటికెళ్లి ఊళ్లో అతని కుటుంబాన్ని వాకబు చేస్తే అన్న ఆశ కూడ ఊళ్లోకి అడుగుపెట్టక తెగిపోయింది. ఆ ఇల్లు ఖాళీ-

శ్రీహరి పెద్ద కుచ్చుటోపీయే పెట్టాడు. దాదాపు ఊళ్లో నాలాటి నిరుద్యోగుల దగ్గర పాతికేసి వేలు పోగేసి-

అపుడు జరిగిన రభస- ఆక్రందనలు నేనిక రాయలేను. ఆ తర్వాత జీవితంలో మళ్లీ ఎప్పుడూ కుచ్చుటోపీ పెట్టుకునే సాహసం చెయ్యలేను నేను-


ఎందుకంటే-

బొంబాయి నుంచి తిరిగి వస్తున్నప్పుడే దాన్ని రైల్లోంచి గిరాటేసాను.

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి నాన్నగారి కంఠంలో వణుకులోని వంపులో ఆక్రందన.

★

## కలెక్షన్ కింగ్ కామెడీ



'కలెక్షన్ కింగ్' మోహన్‌బాబు ధరించే దుస్తులు చాలా వెరైటీగా వుండటమే కాకుండా ఆకర్షణీయంగా వుంటాయి. షూటింగ్‌లో కలిసినప్పుడు మీ కాస్ట్యూమ్స్ ప్రత్యేకంగా వుంటాయి. ఎవరు కుడతారని ఓ విలేకరి అడిగితే- మోహన్‌బాబు నవ్వుతూ 'టైలర్' అన్నారుట.

## మాధవి పెళ్లికల

మాధవికి ఇప్పుడు పెళ్లి చేసుకుని ఓ పాపని కనాలని వుందట. కాని ఆమెవేపు ఎవరూ చూడ్డం లేదు. కారణం మాధవి టీనేజ్ దాటిపోయింది. కమల్‌హాసన్, రజనీకాంత్‌ల వెంట తిరగకపోయి వుంటే ఇప్పటికే మాధవి పెళ్లి అయిపోయి వుండేది. ఆ తర్వాత ఒక అమెరికన్‌ని తన వలలో వేసుకొందట. అతన్ని వదిలేసి ఇపుడు ఓ ఇటాలియన్‌తో కాలక్షేపం చేస్తోంది.

- సత్యమూర్తి

